క్లుప్తంగా

ఉలవ విత్తనాలకు దరఖాస్తుల ఆహ్వానం

సంబేపల్లి: ఉలవ విత్తనాలు పొందేందుకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి కిషోర్ నాయక్ తెలిపారు. మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ, ఆర్బీకే సిబ్బందితో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఖరీఫ్ సీజన్లో వర్షాలు తక్కువగా కురవడంతో పంట సాగు విస్తీర్ణం తగ్గినందున ప్రభుత్వం యాభైశాతం రాయితీతో ఉలవ పంటసాగుకు విత్తనాలు మంజూరు చేస్తోందన్నారు. ఏ పంట వేయని రైతులు ఈ విత్తనాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 8లోపు ఆయా గ్రామాల్లోని ఆర్బీకేల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఈకార్యక్రమంలో రెవెన్యూ, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో అమ్మవారికి రాహుకాల పూజలు

రాయచోటిటౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ అమ్మవారికి భక్తిశ్రద్ధలతో రాహుకాల పూజలు నిర్వహించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఆలయ ఈవీ రమణారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ప్రధాన అర్చకులు కృష్ణస్వామి, శంకర స్వామి ఆధ్వర్యంలో రాహుకాల పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకులు రాహుకాల పూజల విశిష్టతను వివరించి చెప్పారు. అలాగు భక్తులకు తీర్థప్రసాదాలు పంచి పెట్టారు.

రెచ్చిపోతున్న మెడికల్ మాఫియా!

రాయచోటి అర్బన్ : జిల్లాలో మెడికల్ మాఫియా నియంత్రణలో ప్రభుత్వ ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో వైఫల్యం చెందారని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జక్కల వెంకటేష్ ఆరోపించారు. శుక్రవారం ఏఐవైఎఫ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రోగులు పలురకాల కారణాలతో ప్రైవేటు వైద్యశాలల్లో వైద్యం చేయించుకోవలసి వస్తుందన్నారు. ప్రైవేటు వైద్యులు రకరకాల టెస్టుల పేరిట రోగులను పీల్చిపిప్పిచేస్తున్నారని ఆరోపించారు. ఆసుపత్రుల యాజమాన్యం నిర్వహణలోని మందుల షాపులలో అధిక ధరలకు మందులు విక్రయించడం, కొన్ని షాపులలో నకిలీమందులను సైతం రోగులకు అంటగడుతూ నిలువునా మోసం చేస్తున్నారన్నారు. ఏఐవైఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మలికార్జున తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీల అభివృద్ధికి కృషి

రాయచోటిటౌన్: మైనార్టీల అభివృద్ధి కోసం బీజేపీ కృషి చేస్తోందని బీజేపీ రాష్ట్ర మైనార్టీ మోర్చా ప్రెసిడెంట్ షేక్ బాజీ అన్నారు. శుక్రవారం రాయచోటి భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీలను కపట ప్రేమతో మోసం చేస్తోందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ మోర్చా వైస్ ప్రెసిడెంట్ షబ్బీర్ అహమ్మద్, రాజంపేట మోర్చా అధ్యక్షులు ఫారూద్ బాబు,రాయచోటి కన్వీనర్ అరమాటి శివగంగిరెడ్డి,రాయచోటి మైనార్టీ మోర్చా షామీద్, రాజంపేట పార్లమెంటరీ ఓబీసీ మోర్చా శివప్రసాద్, పట్టణ అధ్యక్షులు నిర్మల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కోడూరు సీఐగా మధుసూదన్‌రెడ్డి



రైల్వేకోడూరు : కోడూరు నూతన సీఐగా మధుసూదన్‌రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ, శాంతి భద్రతలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తానని, అందుకు సహకరించాలని ప్రజలను కోరారు. అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతకుముందు పలువురు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

వ్యాపారులూ.. మోసపోవద్దు

రాజంపేట: పట్టణంలో రెండురోజుల నుంచి గుర్తు తెలియని వ్యక్తి వివిధ సెల్‌ఫోన్ నెంబర్ల నుంచి వ్యాపారస్తులు, ట్రేడ్ లైసెన్స్‌దారులకు ఫోన్ చేసి నగదును ఫోన్‌పే, గూగుల్ పే ద్వారా వేయాలని కోరుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని రాజంపేట మున్సిపాలిటి కమిషనరు జనార్దన్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఇలాంటి వ్యక్తి కాల్స్‌కు మోసపోవద్దని సూచించారు. మున్సిపాలిటికి సంబంధంలేని వారి ఫోన్లకు అమౌంట్ పంపరాదని తెలిపారు. అవసరమైతే మున్సిపాలిటీ కార్యాలయానికి వచ్చి వివరాలను తెలుసుకోవాలని సూచించారు.

ఓటర్ల జాబితా సర్వే విధిగా నిర్వహించాలి

పెనగలూరు: ఓటర్ల జాబితాపై సర్వేను వేగవంతం చేయాలని తహశీల్దార్ శ్రీధర్ రావు అన్నారు. శుక్రవారం సాయంత్రం తహశీల్దార్ కార్యాలయంలో బీఎల్ఓలు, వీఆర్ఓలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓటర్ల సర్వేపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని తెలియపరచాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, చనిపోయిన వారి ఓటర్ల జాబితా, వివాహమైన వారి ఓటర్ల జాబితా, అడ్రసు మార్పులు, తదితర అంశాలన్నింటిపై బీఎల్ఓలకు వివరించారు. సర్వేను గడువులోపు పూర్తిచేసేలా కృషి చేయాలన్నారు. ఆర్ఐ చంద్రమోహన్ రెడ్డి, బీఎల్ఓలు, వీఆర్ఓలు పాల్గొన్నారు.

జనం మెచ్చిన జగన్ పాలన

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



చాకిబండ గ్రామంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథరెడ్డి

చిన్నమండెం : సంక్షేమాభివృద్ధిలో సీఎం జగన్ సరికొత్త అడుగులు వేస్తున్నారని వైఎస్ఆర్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పేర్కొన్నారు. చిన్నమండెం మండలం చాకిబండ గ్రామంలో రెండవ రోజు నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో జెడ్పీ మాజీ వైస్‌చైర్మన్ దేవనాథ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలోని బలిజపల్లె, కుమ్మరపల్లె, వర్ధన్నగారిపల్లె, నగిలివాండ్లపల్లె, కురవపల్లెలలో శ్రీకాంత్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం అందిస్తున్న పథకాలను వివరిస్తూ, సమస్యలపై ఆరా తీస్తూ కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల మ్యానిఫెస్టోలో జగన్ ఇచ్చిన హామీలను 99 శాతానికి పైగా అమలుచేయడంతో ప్రతి ఇంటా సంక్షేమ బావుటా ఎగురుతోందన్నారు.

–తమకు ఆసరా, కాపునేస్తం, ఇన్‌పుట్ సబ్సిడీ, డ్వాక్రా సున్నా వడ్డీ తదితర పథకాలు అందాయని సుంకర వెంకటలక్ష్మమ్మ తెలిపారు. తమకు రైతు భరోసా, డ్వాక్రా సున్నా వడ్డీ, రైతుల సున్నా వడ్డీ, ఇన్‌పుట్ సబ్సిడీ తదితర పథకాలు అందాయని బందార్ల లక్ష్మీ కుమారి హర్షం వ్యక్తం చేశారు. వీరితో పాటు ఇంటింటా మహిళలు తమకు జరిగిన మేలు గురించి వివరించి ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ శ్రీరాములు, మాజీ ఎంపీటీసీ వెంకట్రామిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నాయకులు మహమ్మద్, షరీఫ్, జిల్లా విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చుక్కా అంజనప్ప, బుడ్డ శ్రీను, మాజీ సర్పంచులు వెంకటేశ్వర్లు, అమ్మాజీ, జయరామిరెడ్డి, ప్రతాప్‌రెడ్డి, సాయిపీరు, పాపిరెడ్డి, కృష్ణ, ఫయాజ్, శివాజీ, సత్యం, గౌస్‌సాబ్, అన్వర్‌బాషా, సారుల్లా, మోహన, దేవేంద్రరెడ్డి, కృష్ణారెడ్డి, రవి, రాజేంద్ర, రామమోహన్‌రెడ్డి, శివారెడ్డి, యహియాఖాన్, ఎంపీటీసీ వెంకటప్పనాయుడు, సర్పంచ్ నజీర్‌అహ్మద్, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.

రామాపురం : ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న గంగిరెడ్డి సత్యనారాయణ కుమారుడు వెంకట్రామయ్య (సాఫ్ట్‌వేర్ ఉద్యోగి)ను ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీసి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

దివ్యాంగులకు చేయూత



దివ్యాంగులకు ట్రై సైకిళ్లు అందజేస్తున్న అధికారులు

రాయచోటిటౌన్ : గడపడకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా దివ్యాంగుల సాధక బాధలను విన్న ఎమ్మెల్యే వారికి అవసరమగు ఉపకరణాలను అందిస్తూ చేయూతనిస్తున్నారు. ఆయా ప్రాంతాలను సందర్శించిన సమయంలో దివ్యాంగులను గుర్తించి వారికి అవసరమైన బ్యాటరీ ట్రైసైకిళ్లు, మూడు చక్రాల బండ్లు, వీల్ చైర్లు చెవిటి యంత్రాలు ప్రభుత్వం ద్వారా వీరికి అందజేశారు. శుక్రవారం నిర్వహించిన మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, ప్రత్యేక అధికారి రాజశేఖర్‌రెడ్డి, వికలాంగుల శాఖ ఏడీ కృష్ణ కిశోర్, బీసీ కార్పోరేషన్ ఈడీ వల్లూరు బ్రహ్మయ్య, జిల్లా పరిశ్రమల అధికారి నాగరాజు, జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు చుక్కా అంజనప్ప పాల్గొన్నారు.

చుక్కల భూమిపై పూర్తి హక్కు

రైతులకు హక్కుల పత్రాల పంపిణీలో ఎమ్మెల్యే మల్లికార్జున రెడ్డి



సుండుపల్లెలో రైతులకు చుక్కలభూముల హక్కు పత్రాలను అందచేస్తున్న రాజంపేట ఎమ్మెల్యే మేడా

సుండుపల్లె (రాజంపేట): చుక్కల భూములపై రైతులకు పూర్తి హక్కులను ప్రభుత్వం కల్పిస్తోందని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం సుండుపల్లె మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో చుక్కలభూముల హక్కుల పత్రాలను పంపిణీ సభకు ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. ప్రతిపక్షనేతగా పాదయాత్రలో ఇచ్చిన మాట కోసం ఇచ్చిన హామీలలో 99 శాతంతో పాటు ప్రజలకు అవసరమైన పథకాలు అమలుచేస్తున్నారన్నారు. రైతులకు మేలు చేకూరే ప్రయోజనాలను అమలు చేస్తున్నారన్నారు. దేశంలో మోడల్ సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిలిచారన్నారు. ప్రతిపక్షాలవి బురదచల్లే కార్యక్రమాలు తప్ప మరొకటి లేదని విమర్శించారు. టీ.సుండుపల్లె మండలంలో 967 రైతులకు చెందిన 1367 ఎకరాల భూములను సులభతరంగా నిషేధిత జాబితా నుంచి తొలగించి రైతులకు ప్రయోజనం కల్పించారన్నారు. గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి ఆన్‌లైన్ సమస్యలను పరిష్కరించారన్నారు. ఎంపీ మిథున్‌రెడ్డి, జడ్పీచైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డితో కలిసి త్వరలో బస్టాండు నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం స్థలం అన్వేషణ జరుగుతోందన్నారు. ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, ఎంపీపీ రాజమ్మ, వైస్‌ఎంపీపీ రెడ్డమ్మ, జడ్పీటీసీ ఇస్మాయిల్, మండల జేసీఎస్ కన్వీనరు రెహమాన్, భత్రాజు కార్పొరేషన్ డైరక్టరు రామ్మోహన్‌రాజు, ఎంపీటీసీ భాను, నాగేశ్వర్, కో–ఆప్షన్ సభ్యుడు కలీం, సర్పంచులు ఆకుల శ్రీను, రామస్వామిరెడ్డి, షరీఫ్, శ్రీనివాసులరెడ్డి, నాగయ్య, నాగేంద్ర, సింగల్‌విండో అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, భానుప్రకాశ్‌రెడ్డి, బలరాంరాజు, మహేశ్వరరెడ్డి, బేరిపల్లె రఫిక్, సుంకర హరి, రాయవరం సచివాలయకన్వీనరు జానీబాష, చంద్రనాయక్, కృష్ణారెడ్డి, బాబురెడ్డి, రెవిన్యూ అధికారులు రైతులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యం కోసం ప్రభుత్వం కృషి

సుండుపల్లె(రాజంపేట): ప్రజారోగ్యం కోసం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని రాజంపేట శాసనసభ్యుడు మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో సీడీపీఓ ఆధ్వర్యంలో పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలకు , టీహెచ్ఆర్ డిస్ట్రిబ్యూషన్ , సాముహిక సీమంతాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఎంపీపీ రాజమ్మ, వైస్‌ఎంపీపీ రెడ్డమ్మ, జెడ్పీటీసీ ఇస్మాయిల్, మండల జెసీఎస్ కన్వీనరు రెహమాన్, భట్రాజు డైరక్టరు రామ్మోహన్ రాజు, ఎంపీటీసీలు నషీమాబాను, కో–ఆప్షన్ సభ్యుడు కలీం, సీడీపీవో సుగుణమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై వినతి

అంగన్‌వాడీ కార్యకర్తల సమస్యలపై ఏఐటీయూసీ జిల్లా నాగేశ్వరి వినతి పత్రాన్ని ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డికి అందచేశారు. ఏఐటీయూసీ జిల్లా కన్వీనరు నాగేశ్వరి, సంధ్య, రామతులసీ, రమణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

జీతాల చెల్లింపులో నిర్లక్ష్యం సరికాదు



డీఈఓ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేస్తున్న ఉపాధ్యాయులు

రాయచోటి అర్బన్ : ఉపాధ్యాయుల జీతాల చెల్లింపు ప్రక్రియలో విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తుండడం తగదని యూటీఎఫ్ అన్నమయ్య జిల్లా కార్యదర్శి హరిప్రసాద్, షేక్ జాబీర్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం డీఈఓ కార్యాలయం ఎదుట జీతాల చెల్లింపులో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యధోరణిని వ్యతిరేకిస్తూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జీతాలు ఆలస్యంగా అందుతుండడంతో ఉపాధ్యాయుల కుటుంబాలు ఆందోళనకు గురవుతున్నాయంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు అందేలా చూడాలన్నారు. యూటీఎఫ్ నేతలు చంద్రశేఖర్, భాస్కర్ రెడ్డి, దావుద్దీన్, రమణమూర్తి, శ్రీధర్‌రెడ్డి, సురేంద్ర రెడ్డి, రాజారమేష్, మస్తాన్, శంకర్‌ప్రసాద్, హాఫీజుల్లా, శ్యాంసుందర్, రఫీ, ఇమ్రాన్, రియాజ్, వెంకటరమణ, ఫయాజ్, చాంద్‌బాషా, జగదీష్, రాజబాబు పాల్గొన్నారు.

సీసీరోడ్లతో గ్రామాల రూపురేఖలు మార్పు

ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొరముట్ల

రైల్వేకోడూరు : సీసీరోడ్ల నిర్మాణంలో గ్రామీణ ప్రాంతాల రూపురేఖల్లో మార్పు వస్తుందని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం మండలంలోని సింగిరివారిపల్లె నుండి గంధం వారిపల్లె వరకు 2కోట్ల 35లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించబోయే సిమెంట్ రోడ్డు పనులకు పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని గ్రామాలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, ఏపీటీడీసీ డైరెక్టర్ నాగేంద్ర, జెట్పీటీసీ రత్నమ్మ, సిహెచ్.రమేష్, కస్తూరి నాగుల నాయుడు, ధనుంజయ నాయుడు, సుబ్బరాయుడు, ప్రతాప్‌రెడ్డి, పోలిన విశ్వనాద్, సుబ్రమణ్యం, రమణారెడ్డి, క్రిష్ణారెడ్డి పాల్గొన్నారు.

ప్రతి హామీ అమలు

చిట్వేలి: పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అందరికీ మంచి చేస్తున్న మనసున్న మారాజు సీఎం జగన్ మోహన్ రెడ్డి అని రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. మైలపల్లి సచివాలయం పరిధిలో శుక్రవారం మధ్యాహ్నం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే మైలపల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడారు. పథకాల వల్ల చేకూరిన లబ్ధి గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చంద్ర, ఎల్వీ మోహన్ రెడ్డి, సుధాకర్ రాజు, ఎంపీడీఓ శివరామిరెడ్డి, తహశీల్దార్ శిరీషా, గ్రామ నాయకులు ప్రదీప్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, గంగిరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, మధు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష.. ఓ చరిత్ర

రైల్వేకోడూరు : జగనన్న సురక్ష ఒక వరమని.. ఈ కార్యక్రమంతో రాష్ట్రంలో ఒక చరిత్ర సృష్టించామని ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతంగా పూర్తి అయిన సందర్భంగా ప్రత్యేక సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని ప్రతి పౌరుడిని ఆప్యాయంగా పలకరించి, ప్రతి గడపకు స్వయంగా వెళ్లి ప్రభుత్వసేవలను అందించేందుకే ప్రభుత్వం జగనన్న సురక్షకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రజలెవ్వరూ ఇబ్బంది పడకుండా వారి ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలను అందించాలనే ముఖ్యమంత్రి జగన్ సంకల్పం అన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గ వ్యాప్తంగా 62,247 హౌసెస్‌ను సర్వే చేయగా ఇందులో 26, 120 మంది నుంచి సమస్యలు వచ్చినట్లు వాటికి సంబంధించి 25,700 సర్టిఫికెట్లు పంపిణీ చేయడం జరిగిందన్నారు. సురక్ష ద్వారా 98శాతం వారి సమస్యలకు పరిష్కారం చూపామని తెలిపారు.జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, జిల్లా టూరిజం డైరెక్టర్ సుధాకర్‌రాజు, జెట్పీటీసీ రత్నమ్మ, ఉప సర్పంచ్ తోట సాయి, పట్టణ అధ్యక్షుడు సిహెచ్.రమేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గునిశెట్టి రమేష్, సుబ్రమణ్యం శివ పాల్గొన్నారు.

ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలి

–మలేరియా సబ్ యూనిట్ అధికారి సుబ్బరాయుడు



నీరు నిల్వ ఉన్న డ్రమ్‌లో అబెట్ ద్రావణాన్ని పిచికారి చేస్తున్న దృశ్యం

సిద్దవటం: ప్రజలు ప్రతి శుక్రవారాన్ని డ్రైడేగా పాటించాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్లూరు సుబ్బరాయుడు తెలిపారు. మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేట లోని గాంధీవీధి, గాండ్లపాలెం, ప్రధాన రహదారి నందు దోమల నివారణకు తీసుకోవాల్సి జాగ్రతలపై అవగాహన, ర్యాలీ నిర్వహించారు. ఈ సదర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఇంట్లోని నీటి తొట్లను, పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా పూల కుండీల్లో, కొబ్బరి బోండాల్లో, పాత టైర్లలో, నీటి తొట్లలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నీరు నిల్వ ఉన్న చోట అబెట్ ద్రావణాన్ని పిచికారి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో పి. కొత్తపల్లె వైద్య సిబ్బంది , ఆశా వర్కర్‌లు , గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీఓ దృష్టికి మండల రెవెన్యూ సమస్యలు



ఆర్డీవోను సన్మానిస్తున్న మేడా విజయభాస్కర్ రెడ్డి

రాజంపేట: రాజంపేట రెవెన్యూ డివిజనల్ అధికారి రామకృష్ణారెడ్డి దృష్టికి నందలూరు రెవిన్యూ సమస్యలను తీసుకెళ్లామని నందలూరు మండలాధ్యక్షుడు మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్డీవోను ఆయన చాంబరులో కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నందలూరు మండల స్థాయిలో నెలకొన్న పలు సమస్యలపై చర్చించామన్నారు. అంతకుముందు ఆర్డీవోగా నియమితులైన సందర్భంగా ఆయన్ను సన్మానించారు. కార్యక్రమంలో మండలనేత అన్నంనాగేంద్ర, ముదిరాజ్ కార్పోరేషన్ స్టేట్ డైరక్టరు లక్ష్మీనరసయ్య, మండలకో–ఆప్షన్‌సభ్యుడు కలీం, మండల ఉపాధ్యక్షుడు తుమ్మల భావన శ్రీధర్‌గౌడ్, పొత్తపి ఎంపీటీసీ మోదుగలపాల్గొన్నారు.

రెజ్లింగ్ పోటీల్లో ప్రతిభ



పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్, పీడీ

ఓబులవారిపల్లె: ఇటీవల అనకాపల్లిలో జరిగిన రాష్ట్రస్థాయి రెజ్లింగ్ పోటీలలో సంజీవపురం గురుకుల పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభ చూపించారు. ఈ పోటీల్లో 6 బంగారు పథకాలు, 7 వెండి పతకాలు, 3 ఇత్తడి పతకాలు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డాక్టర్ మన్సూర్ అలి, ఫిజికల్ డైరెక్టర్ విజయానందమూర్తి, పీఈటీ సురేంద్ర అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 21 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో సంజీవపురం పాఠశాల తరపున పాల్గొనగా ఎస్ గురువిష్ణు, కె నిఖిల్, కె ఆశోక్, పి అయ్యబాబు, బి గౌతమ్, ఈ సుబ్రమణ్యం, ఎం వంశీ, ఎస్ నవీన్ కుమార్, ఎస్ కళ్యాణ్ , జె హరి, ఎం గౌతమ్, డి బాలాజీ, ఎస్ చరణ్ కుమార్, ఎం అవినాష్, ఈ ప్రవీమ్ కుమార్, కె శివాజీ, బి బాలాజీ నాయక్, ఎం మధు, ఎస్ యువరాజ్, కె గోపిచంద్, పి వెంకటేశ్వర్లు పతకాలు సాధించారని పేర్కొన్నారు.

మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి లేదు

వీరబల్లె (రాయచోటిటౌన్) : మంత్రి పెద్దిరెడ్డిని విమర్శించే స్థాయి చంద్రబాబునాయుడికి లేదని వీరబల్లె మండలం ఎంపీపీ గాలివీటి రాజేంద్రనాథరెడ్డి ఆరోపించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు రాజకీయం మొత్తం మోసమేనని బిడ్డనిచ్చిన మామనే వెన్నుపోటు పొడిచిన నీచ రాజకీయ చరిత ఆయనకే చెల్లిందని విమర్శించారు. అలాంటి వ్యక్తి పెద్దరెడ్డి రామచంద్రారెడ్డిని విమర్శించడం ఏమిటని విమర్శించారు. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులు ఏ నాడు చేపట్టలేని వ్యక్తి ఈ రోజు ప్రాజెక్టుల గురించి మాట్లాడుతుంటడం హస్యాస్పందంగా ఉందన్నారు.

స్థాయిని మరిచి విమర్శలు సరికాదు

ఒంటిమిట్ట: పుంగనూరులో చంద్రబాబు పర్యటనను అడ్డుకున్న దానిపై పెద్దరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబ సభ్యులపై స్థానిక టీడీపీ నాయకుడు మాజీ కల్లు గీత కార్మిక సంఘం డైరెక్టర్ కొమర వెంకటనరసయ్య స్థాయిని మించి పదే పదే విమర్శించడం సరికాదని రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ కార్పొరేషన్ డైరెక్టర్, తంబళ్లపల్లె అసెంబ్లి పరిశీలకులు ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి అన్నారు. తీరు మార్చుకోక పళ్లు రాలుతాయని హెచ్చరించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ...సర్పంచుకు ఎక్కువ...మండల నాయకుడికి తక్కువైన కొమర నరసయ్య మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబాన్ని విమర్శించడం హాస్యస్పదం అన్నారు. చిత్తూరు ప్రజలు చంద్రబాబు నాయుడిని ఎందుకు అడ్డుకున్నారో తెలుసుకోని మాట్లాడాలని హితవు పలికారు.

వరి నారు కొనలను తుంచి నాటాలి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వంశీ

సిద్దవటం: వరి నాట్లు నాటేటప్పుడు నారు కొనలను తుంచి నాటడం వల్ల కాండం తొలచు పురుగును నివారించవచ్చునని అగ్రికల్చర్ అసిస్టెంటు వంశీ తెలిపారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఆయన శుక్రవారం సిద్దవటం మండలంలోని టక్కోలి గ్రామ పంచాయతీ పరిధిలోని ఖాజీపల్లె గ్రామంలో వరిలో రాజీ లేని అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరిలో ప్రతి 2 మీటర్లకు 9 అంగుళాలు కాలి బాటలు వేసుకోవాలన్నారు. తద్వారా మొక్కకు గాలి, వెలుతురు సోకి సుడి దోమ పోటును నివారించుకోవచ్చునన్నారు. వ్యవసాయ సిబ్బంది సుమలత, రైతులు, పాల్గొన్నారు.

7న చలో తిరుపతిని జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : విద్యుత్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ఉన్నతాధికారుల నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ ఈనెల 7న చలో తిరుపతి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, విద్యుత్ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏ.వి.రమణ పిలుపునిచ్చారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో చలో తిరుపతికి సంబంధించిన పోస్టర్లను శుక్రవారం విడుదల చేశారు. తిరుపతి ఎస్పీడీసీఎల్ కార్యాలయం వద్ద నిర్వహించే ఆందోళనకు కార్మికులు పెద్ద ఎత్తున హాజరు కావాలంటూ వారు పిలుపునిచ్చారు. కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ డిస్కమ్ అధ్యక్షులు సుబ్రమణ్యం రాజు, డివిజన్ అధ్యక్షుడు నాగేష్‌గౌడ్, నేతలు ఖాదర్‌బాష, వీరారెడ్డి, గజేంద్ర నాయుడు,తో పాటు ఏఐటియుసి నేతలు రెడ్డెప్పరెడ్డి పాల్గొన్నారు.

సస్యరక్షణతో ఆశాజనక దిగుబడులు

–ఉద్యానశాఖ అధికారిణి నాగమణి



గోరాన్‌చెరువు గ్రామంలో రైతులకు శిక్షణ ఇస్తున్న ఉద్యానశాఖ అధికారిణి నాగమణి

గాలివీడు : టమోట సాగులో యాజమాన్య పద్ధతులు సస్యరక్షణ చర్యలతో ఆశాజనక దిగుబడులు సాధించవచ్చునని ఉద్యానశాఖ అధికారిణి టి.నాగమణి పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని ఎగువగొట్టివీడు , గోరాన్‌చెరువు గ్రామాల్లో రైతులకు యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. టమోట సాగులో విత్తన శుద్ధి, ఎరువుల యాజమాన్యం, సూక్ష్మ దాతు లోపాల నివారణ, నీటి యాజమాన్యం, పంటను ఆశించే చీడపీడలు, తెగుళ్ల నివారణ గురించి వివరించారు. ఆకుమాడు తెగుళ్ల నివారణకు కవచ్ రెండు గ్రాములు ఒక లీటరు నీటిని కలుపుకొని 15 రోజుల వ్యవధిలో పిచికారి చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రైతు భరోసా సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

విజయవాడ ధర్నాకు తరలిరండి

రాయచోటి అర్బన్ : రైతు సమస్యలపై ఈనెల 7న నిర్వహించనున్న ధర్నాకు రైతులంతా తరలిరావాలని అన్నమయ్య జిల్లా రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి పిలుపునిచ్చారు. ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆయన రైతులతో కలసి విడుదల చేశారు. రైతు సమస్యల పరిష్కారంలో కేంద్ర–రాష్ట్రాల పాలకులు విఫలమయ్యారన్నారు. రైతులకు పంటసాగుకు ఎకరాకు రూ. 10వేలు సహాయం అందించాలని, రైతుల విద్యుత్ మోటార్లకు విద్యుత్‌స్మార్ట్ మీటర్ల బిగింపు యోచనను విరమించుకోవాలని తదితర డిమాండ్లతో విజయవాడలో నిర్వహిస్తున్న ధర్నాకు రైతులంతా పెద్ద ఎత్తున హాజరై విజయవంతం చేయాలంటూ ఆయన విజ్ఞప్తి చేశారు.

సత్యమ్మ తల్లికి పూజలు

పుల్లంపేట: మండల పరిధిలోని అనంతంపల్లి సమీపంలోని జాతీయరహదారిపై వెలిసిన శ్రీ సత్యమ్మ తల్లికి మహిళలు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే మహిళలు అమ్మవారిని దర్శించుకొని కాయా, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోరిన కోర్కెలు తీర్చే దేవత శ్రీ సత్యమ్మతల్లి అని మహిళా భక్తుల నమ్మకం.